
ఎమ్మెల్యే శ్రీనివాస్ యాదవ్‌ను ఆశీర్వదిస్తున్న పాస్టర్లు

ఎమ్మెల్యేకు పాస్టర్ల ఆశీర్వచనం

అమీర్‌పేట, మే 14 (ఆంధ్రజ్యోతి): చర్చి నిర్వాహకులకు అన్నివిధాలుగా సహకరిస్తున్న సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను ఏడు చర్చిల పాస్టర్లు బైబిల్ పఠిస్తూ ఆశీర్వదించారు. బుధవారం అమీర్‌పేట డివిజన్‌లోని వివేకానంద కమ్యూనిటీహాల్‌లో ఏడు చర్చిల ఐక్య ఉత్సవం ఘనంగా జరుపుకున్నారు. దీనికి ఏడు సంఘాలకు చెందిన సుమారు 350 మంది హాజరయ్యారు. వీరందరికి విందుకు కావాల్సిన నిధులను ఎమ్మెల్యే సమకూర్చారు. ఇందుకు పాస్టర్లు తలసానిని ఆశీర్వదించారు. కార్యక్రమంలో క్రిస్టియన్ ఫెలో చర్చి నిర్వాహకుడు డాక్టర్ సైమన్ పీటర్, చర్చి ఆఫ్ ద లివింగ్ గాడ్ నిర్వాహకుడు డాక్టర్ రెజినాల్డ్, పాస్టర్ ప్రకాష్, సియోను సహవాసము, పాస్టర్ సుదర్శన్, బ్రదర్ ప్రసాద్, పాస్టర్ నగరం, ఫిలిప్, పాస్టర్ సురేష్ మనోహరన్‌తో పాటు ప్రవీణ్‌రెడ్డి, కూతురు నర్సింహ, కట్టా బలరాం, నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


హుండీలను లెక్కిస్తున్న ఎల్లమ్మ ఆలయ సిబ్బంది

ఎల్లమ్మ ఆలయం హుండీ ఆదాయం రూ.50.24 లక్షలు

అమీర్‌పేట, మే 14 (ఆంధ్రజ్యోతి): బల్కంపేట ఎల్లమ్మ ఆలయం హుండీలను బుధవారం లెక్కించారు. 49 రోజులకు సంబంధించి 18 హుండీల ద్వారా రూ.50,24,653 ఆదాయం వచ్చినట్లు ఈవో బి.కృష్ణ తెలిపారు. జనరల్ హుండీలలో రూ.48,73,340రాగా, అన్నదానం హుండీలో రూ.1,46,313 వచ్చాయి. వీటితో పాటు 77 యూఎస్ డాలర్లు, ఒక దీరమ్స్, 230 యూరోస్, 48 సౌది దినార్, 11 గ్రాముల మిక్స్‌డ్ బంగారం, రెండు కేజీల వెండి వచ్చినట్లు ఈవో వెల్లడించారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన లెక్కింపు సాయంత్రం 5 గంటలకు ముగిసింది. కార్యక్రమంలో ట్రస్టీ చైర్మన్ సాయిబాబాగౌడ్, దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీదేవి, సిబ్బంది పాల్గొన్నారు.


అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏసీపీ శంకర్ రాజు

హెల్మెట్ తప్పక ధరించాలి

● నార్త్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్ రాజు

అమీర్‌పేట, మే 14 (ఆంధ్రజ్యోతి): అతివేగం ప్రమాదకరమని, వాహనాలు నడిపేటప్పుడు ప్రతి ఒక్కరూ హెల్మెట్ తప్పకుండా ధరించాలని నార్త్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు సూచించారు. హైదరాబాద్ కమిషనర్ సీవీ ఆనంద్, ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్, ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే ఆదేశాల మేరకు బుధవారం బేగంపేట టీటీఐ ఇన్‌స్పెక్టర్ నాగుల అశోక్‌తో కలిసి టాటా ఏఐజీ ఇన్సూరెన్స్ సిబ్బందికి అమీర్‌పేటలోని కార్యాలయంలో రోడ్డు ప్రమాదాల గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ అతివేగం అంతిమ ప్రయాణం అవుతుందన్నారు. ప్రతీ ఒక్కరు రహదారులపై ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ప్రమాదాల నివారణకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో సంస్థ డిప్యూటీ వైస్ ప్రెసిడెంట్ గోపాల్‌రావు, డిప్యూటీ మేనేజర్ సురేష్‌బాబు, బేగంపేట టీటీఐ సిబ్బంది అయాన్, కృష్ణ పాల్గొన్నారు.

మహిళలకు ఉచితంగా డ్రైవింగ్ శిక్షణ


డ్రైవింగ్ నేర్చుకుంటున్న మహిళలు

బేగంపేట, మే 14 (ఆంధ్రజ్యోతి): బేగంపేటలోని ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్‌లో మహిళలకు ఉచితంగా ద్విచక్ర వాహనాల డ్రైవింగ్ శిక్షణను ఇస్తున్నారు. ట్రాఫిక్ పోలీసులు, హీరో మోటార్స్ కార్ సంయుక్త అధ్వర్యంలో ఈ శిక్షణ ఇస్తున్నట్లు హీరో మోటార్ కార్ మేనేజర్ ఇమామ్ జాఫర్ హెచ్ సాగర్ తెలిపారు. ఐదు రోజులకు ఒక బ్యాచ్ చొప్పున ఎంపిక చేసి డ్రైవింగ్ నేర్పిస్తున్నట్లు తెలిపారు. డ్రైవింగ్ నేర్చుకోవాలనుకునే వారు 18 సంవత్సరాలు నిండి ఉండాలని, ఆధార్‌కార్డుతో పాటు ఫొటో తీసుకుని వచ్చి పేరు నమోదు చేసుకోవాలని ఆయ న సూచించారు. పురుషులకు కూడా నేర్పించేందుకు నిర్ణయించామని, త్వరలోనే వారికి కూడా టూ వీలర్ డ్రైవింగ్ పై శిక్షణ ఉంటుందని ఆయన తెలిపారు.

బంధువులా నటించి రూ.75 వేలు మోసం

బంజారాహిల్స్, మే 14 (ఆంధ్రజ్యోతి): బంధువులా నటించి అవసరాల్లో ఉన్నానంటూ వాట్సాప్ మెస్సేజ్ పెట్టి రూ.75 వేలు మోసం చేశారు సైబర్ నేరగాళ్లు. బంజారాహిల్స్ రోడ్డు నెంబర్.5లో నివాసం ఉండే రాయప్రోలు వెంకట రమేష్ చార్టెడ్ అకౌంటెంట్. ఈనెల 12న అమెరికాలో ఉండే తన వదిన డీపీతో వాట్సాప్‌లో రూ.50 వేలు కావాలని ఓ మెస్సేజ్ వచ్చింది. వాట్సాప్‌లో వచ్చిన యూపీఐ ఐడీకి రమేష్ వెంటనే డబ్బులు పంపించాడు. మరోసారి రూ.25 వేలు పంపించాడు. అనంతరం పరిశీలించగా యూపీఐ ఆశాభాను పేరిట ఉంది. వదినకు ఫోన్ చేయగా ఆమె కాదని తేలింది. దీంతో రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బీరు బాటిల్ పగలగొట్టొద్దన్నందుకు దాడి

బంజారాహిల్స్, మే 14 (ఆంధ్రజ్యోతి): బీరు బాటిల్ పగలగొట్టొద్దన్నందుకు ముగ్గురు కలిసి ఇద్దరిపై దాడి చేసి గాయపర్చారు. జూబ్లీహిల్స్ నవనిర్మాణ్‌నగర్‌లో నివాసం ఉండే ఎ.అశోక్‌కుమార్ డ్రైవర్. ఈనెల 13న ఫిలింనగర్‌లోని గోల్‌స్పాట్ వైన్స్‌కు వెళ్లి మద్యం తాగుతున్నాడు. కొద్దిసేపటికి అక్కడే ఉన్న సెక్యూరిటీ నిరంజన్ కూడా మద్యం తాగాడు. ఇంతలో ఓ వ్యక్తి అక్కడకు వచ్చి బీరు బాటిల్ పగలగొట్టాడు. అలా చేయవద్దని అశోక్ వారించాడు. ఆ వ్యక్తి వినిపించుకోకుండా అలాగే మరో బాటిల్ పగలగొట్టి బయటకు వెళ్లాడు. కొద్దిసేపటికి మరో ఇద్దరితో కలిసి వచ్చి అశోక్, నిరంజన్‌పై దాడి చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కౌంటర్‌పై ఉంచిన సెల్‌ఫోన్ మాయం

బంజారాహిల్స్, మే 14 (ఆంధ్రజ్యోతి): కౌంటర్‌పై పెట్టిన సెల్‌ఫోన్ మాయమైంది. మణికొండకు చెందిన సీహెచ్ నాగలక్ష్మి బంజారాహిల్స్ రోడ్డు నెంబర్.2లోని జూనియర్ ఆర్టిస్ట్ కార్యాలయం వద్ద హోటల్ నడుపుతోంది. ఈనెల 13న కౌంటర్‌పై ఉండగా వినియోగదారుడు వచ్చాడు. దీంతో సెల్‌ఫోన్ కౌంటర్‌పై ఉంచి లోపలికి వెళ్లి వచ్చినరికి ఫోన్ కనిపించలేదు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పూడిక తీసి.. నాలాలో పోసి!

● డంపింగ్ అంతా అక్కడే
● జీహెచ్‌ఎంసీ నిధులు నాలా పాలు
● నత్తనడకన కొనసాగుతున్న నాలా పూడికతీత పనులు
● కొరవడిన ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణ

బేగంపేట, మే 14 (ఆంధ్రజ్యోతి): వేసవిలో నాలా ల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించే పనులు చేపడతారు. అధికారులు టెండర్లను పిలిచి గుత్తేదారులకు పనులను అప్పగిస్తారు. వీటిని పర్యవేక్షించాల్సిన ఇంజనీరింగ్ అధికారులు గుత్తేదారులతో కుమ్మక్కువడంతో పనులు నత్తనడకన సాగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ప్రధానంగా నాలాలో తీసిన పూడికను అక్కడే డంప్ చేయడంతో ఇటీవల కురిసిన వర్షానికి ఆ డంప్ చేసిన పూడికవ్యర్థాలు నాలాలో కలిశాయి. ఈ విషయాన్ని స్థానికులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నాలుగు నాలాల పూడికతీతకు రూ.55 లక్షలు

బేగంపేట డివిజన్‌లోని నాలుగు నాలాల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించేందుకు అధికారులు రూ.55 లక్షలతో పూడికతీత పనులకు శ్రీకారం చుట్టారు. పికెట్ నాలా, చికోటిగార్డెన్‌లోని ద్వారకాదాస్ నాలా, ఓల్డ్ కస్టమ్స్ బస్తీ నాలా, బేగంపేటలోని బ్రాహ్మణవాడి నుంచి మాతాజీనగర్ వరకు ఉన్న కూకట్‌పల్లి నాలాలో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించేందుకు జీహెచ్‌ఎంసీ ఏప్రిల్‌లో టెండర్లను పిలిచి పనులను అప్పగించింది. వీటిని దక్కించుకున్న గుత్తేదారు ఏప్రిల్‌లో పనులను ప్రారంభించారు. నాలా పూడికతీత పనులు వర్షాకాలం ప్రారంభమయ్యేలోగా పూర్తి చేయాలి. పికెట్ నాలాలో పనులను వేగంగా నిర్వహించిన గుత్తేదారు మరో మూడు నాలాల్లో పనులు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

వర్షానికి సగం పూడిక మళ్లీ నాలాలోకే..

ఓల్డ్‌కస్టమ్స్‌లోని రైలుపట్టాల వద్ద నుంచి శ్రీ కేసరి హనుమాన్ ఆలయం వరకు ఉన్న నాలాలో కొన్నిరోజుల క్రితం పూడికతీత పనులను చేపట్టారు. ఎగువ నుంచి పూడిక తీసిన మట్టి, చెత్తాచెదారాన్ని తీసుకొచ్చి హనుమాన్ ఆలయం సమీపంలోని నాలాకు ఒకవైపున డంప్ చేశారు. ఇటీవల నగరంలో పలుమార్లు వర్షాలు కురవడంతో నాలాలోనే డంప్ చేసిన వ్యర్థాలు వరద ఉధృతికి కొట్టుకుపోయాయి. దీంతో ఓల్డ్ కస్టమ్స్‌లో తీసిన పూడిక వెళ్లి కూకట్‌పల్లి నాలాలో కలిసింది. పూడిక తీసిన వ్యర్థాలను తడి ఆరగానే ఇక్కడ నుంచి తరలించేలా ఇంజనీరింగ్ అధికారులు చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

కూకట్‌పల్లి నాలాలో అంతంత మాత్రమే..


ఇటీవల కురిసిన వర్షానికి నాలాలో కలుస్తున్న పూడిక వ్యర్థాలు

వర్షాకాలంలో కూకట్‌పల్లి నాలా వరదనీటితో ఉధృతంగా ప్రవహిస్తూ రెండు వైపులా ఉన్న బస్తీలను ముంచెత్తుతోంది. బేగంపేట ఫ్లై ఓవర్ నుంచి మాతాజీ నగర్ వరకు ఉన్న ఈ నాలా చాలా వెడల్పుతో పాటు లోతుగా ఉంటుంది. ఇక్కడ సుమారు నాలుగు అడుగుల మేర నాలాలో పూడిక పేరుకుపోయి ఉంటుంది. నాలా పూడికతీత పనులను చేపట్టిన గుత్తేదారు పూర్తిగా పూడికను తొలగించకుండా కొంతమేరకు తీయడంతో వర్షాకాలంలో కురిసిన వర్షాలకు వరదలు వస్తున్నాయని బ్రాహ్మణవాడి, మయూరిమార్గ్‌వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తీసిన పూడికను నాలాలో రెండువైపులా డంప్ చేయడంతో ఇటీవల కురిసిన వర్షాలకు ఇందులో కొంత మళ్లీ నాలాలోకి చేరిందని స్థానికులు తెలిపారు. ప్రతీ సంవత్సరం ఈ నాలాలో పూడికతీత పనులు పూర్తిస్థాయిలో చేయక పోవడం వల్లనే నాలాకు రెండువైపులా ఉన్న బస్తీలు ముంపునకు గురవుతున్నాయని ఆయా ప్రాంతాలవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు ప్యాంటలూన్ నుంచి ద్వారకాదాస్ కాలనీ మీదుగా వెళ్తున్న నాలాపై స్లాబ్ ఉంది. ఇక్కడ పూడిక తీయాలంటే స్లాబ్‌పై ఉన్న మ్యాన్‌హోల్‌ను తొలగించి అందులో మనుషులు దిగి పూడికను బయటకు తీయాలి. ఇక్కడ కూడా ఒకరిద్దరితో పనులను అసంపూర్తిగా చేశారనే ఆరోపణలు ఉన్నాయి.

మే ఆఖరు వరకు నాలా పూడిక పనులు


బేగంపేట డివిజన్‌లోని నాలుగు నాలాల్లో పూడికతీత పనులను ఏప్రిల్‌లో ప్రారంభించాం. పికెట్ నాలాలో పూడికతీయడంతో పాటు వ్యర్థాలను తొలగించాం. ఓల్డ్ కస్టమ్స్ బస్తీ నాలాలో పూడిక పనులు పూర్తయ్యాయి. అయితే వ్యర్థాలను నాలాలోనే డంప్ చేశారు. వీటిని తొలగించాల్సి ఉంది. కూకట్‌పల్లి నాలాలోని మయూరిమార్గ్ వద్ద పనులు జరుగుతున్నాయి. మే ఆఖరు వరకు పనులు కొనసాగిస్తాం.

- మహేష్, డీఈ, బేగంపేట సర్కిల్

చిన్నపాటి వర్షాలకే నందినగర్ మునక

● మూడు ప్రాంతాల నుంచి వస్తున్న వరదనీరు ● మురుగునీటితో నిండుతున్న నీటిసంపులు

బంజారాహిల్స్, మే 14 (ఆంధ్రజ్యోతి): బంజారాహిల్స్ రోడ్డు నెంబర్.14లోని నందినగర్‌వాసుల పరిస్థితి దయనీయంగా తయారైంది. బసవతారకం కేన్సర్ ఆస్పత్రిని ఆనుకుని ఉన్న నందినగర్‌లో ప్రతీ యేటా వర్షాకాలంలో బస్తీవాసులు బిక్కుబిక్కుమంటూ బతకాల్సిన పరిస్థితి. చిన్నపాటి వర్షం కురిస్తే చాలు లోతట్టు ప్రాంతమైన ఈ బస్తీలోకి ఎగువన ఉన్న నందినగర్ బస్టాండ్, కేన్సర్ ఆస్పత్రి, కేబీఆర్ పార్కు నుంచి పెద్ద ఎత్తున వరదనీరు వచ్చి బస్తీని ముంచెత్తుతోంది. ఏళ్ల తరబడి ఉన్న ఈ సమస్యకు చెక్ పెట్టాలంటే రోడ్లు వేయాలి. అలాగే, డ్రైనేజీ లైన్ సామర్థ్యం పెంచాలి. కేన్సర్ ఆస్పత్రి నుంచి వస్తున్న మురుగునీరు కూడా బస్తీ మురుగు నీటితో నిండిపోతుండడంతో బస్తీ మధ్యలోని పైపులైన్ ఎప్పటికప్పుడు పొంగుతోంది. బస్తీ మధ్యలో ఉన్న ఈ లీకేజీ వల్ల చుట్టుపక్కల నివాసం ఉంటున్న వారు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఆస్పత్రికి ప్రత్యేక లైన్ వేసుకోవాలని కోరినా సరే బస్తీ పెద్దలుగా వ్యవహరిస్తున్న కొందరి ప్రోత్సాహంతో బస్తీలైన్‌లో కలిపేశారు. ప్రస్తుతం బస్తీలో రోడ్లు వేస్తున్నప్పటికీ బ్రహ్మకుమారి బిల్డింగ్ పక్కన ఉండే ఈ భయంకరమైన రోడ్డును మాత్రం పట్టించుకోవడం లేదు. వర్షాకాలంలోపు ఈ రోడ్డుకు మోక్షం కలగకపోతే బస్తీలోని పరిస్థితి గతంలో కంటే దయనీయంగా తయారవనుంది. పైభాగంలో వేసిన కొత్త రోడ్లు ఇంకాస్త ఎత్తు పెరగడంతో వరదనీరు మరింత ఎక్కువగా బ్రహ్మకుమారి పక్కన నిలిచిపోయి స్థానికుల భయాన్ని మరింత పెంచనుంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి వర్షాకాలంలోపు ఈ సమస్యకు చెక్ పెడతారో? లేదో? వేచి చూడాల్సిందే.


రెండు రోజుల క్రితం కురిసిన వర్షానికి ఇంట్లోకి చేరిన వరదనీరు


చిన్నారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్

స్విమ్మింగ్‌పూల్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే

ఖైరతాబాద్, మే 14 (ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ జోన్ ఆధ్వర్యంలో నడుస్తున్న స్విమ్మింగ్‌పూల్‌ను బుధవారం కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ పరిశీలించి ఏర్పాట్లను సమీక్షించారు. ఆయన గోల్కొండలోని స్విమ్మింగ్‌పూల్‌ను జీహెచ్‌ఎంసీ క్రీడా విభాగం డిప్యూటీ డైరెక్టర్ రహీనా బేగం, తదితరులతో కలిసి పరిశీలించారు. శిక్షణ పొందుతున్న చిన్నారులతో మాట్లాడారు. స్విమ్మింగ్‌పూల్‌లో నీటిని నిబంధనల ప్రకారం తొలగించి శుభ్రం చేయాలని ఎమ్మెల్యే అధికారులను సూచించారు.

డెత్ సర్టిఫికెట్ కోసం ఫారం-7 ఇవ్వాల్సిందే

● ఓటరు జాబితా నుంచి పేరు తొలగింపునకు వినూత్న పద్ధతి

ఖైరతాబాద్, మే 14 (ఆంధ్రజ్యోతి): చనిపోయిన వారి పేర్లను ఓటరు జాబితా నుంచి ఎప్పటికప్పుడు తొలగించేందుకు ఖైరతాబాద్ నియోజకవర్గ ఎన్నికల అధికారులు వినూత్న పద్ధతిని ప్రారంభించారు. ఇళ్లలో మృతి చెందిన వారి కుటుంబీకులు మరణ ధ్రువీకరణ పత్రం కోసం దరఖాస్తు చేసుకున్న సమయంలోనే ఓటరు జాబితా నుంచి ఆ పేరును తొలగించేందుకు ఇచ్చే ఫారం-7ను నింపి ఇవ్వాలనే నిబంధన తీసుకువచ్చారు. దీంతో పాటు ఆస్పత్రుల్లో మృతిచెందే వారి ధ్రువీకరణ పత్రాలు ఆన్‌లైన్‌లో ఇస్తున్నందున సంబంధిత వైద్య విభాగం నుంచి ఎన్నికల విభాగానికి సమాచారం అందేలా ఏర్పాట్లు చేశారు. దీంతో గడచిన నెల రోజులుగా ఖైరతాబాద్ నియోజకవర్గంలో చనిపోయిన దాదాపు 200 మంది పేర్ల తొలగింపునకు ఫారం-7 దరఖాస్తులు అందాయని నియోజకవర్గ ఎన్నికల అధికారి, సర్కిల్- 18 ఉప కమిషనర్ సమ్మయ్య తెలిపారు. బుధవారం ఖైరతాబాద్ నియోజకవర్గ రాజకీయ నాయకుల సమావేశం ఖైరతాబాద్ కార్యాలయంలో జరిగింది. ఇందులో కొన్ని పోలింగ్ స్టేషన్ల మార్పులు అడుగుతున్నారని, వాటిపై విచారించి ఆగస్టులో నిర్ణయం తీసుకుంటామని డీసీ పేర్కొన్నారు. సమావేశంలో టీడీపీ నేత బాలాజీ గోస్వామి, బీఎస్పీ నేత ప్రవీణ్, కాంగ్రెస్ నేత ధర్మేందర్, ఎంఐఎం నేత మొహసిన్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సమ్మయ్య

సరస్వతి పుష్కరాలకు ప్రత్యేక బస్సులు

బాలానగర్, మే 14 (ఆంధ్రజ్యోతి): సరస్వతి పుష్కరాల సందర్భంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వర్వం పుణ్యక్షేత్రానికి(త్రివేణి సంగమం) టీజీఎస్ ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడుపుతోందని కూకట్‌పల్లి ఆర్టీసీ డిపో మేనేజర్ డి.హరి ఒక ప్రకటనలో తెలిపారు. సరస్వతి పుష్కరస్నానం చేయాలనుకొనే యాత్రికులు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఒకే కాలనీ నుంచి 40 మంది ప్రయాణికులు ఉంటే ఆ కాలనీకి బస్సును పంపిస్తామని ఆయన తెలిపారు. నేటి నుంచి 26వ తేదీ వరకు ఈ సేవలు అందుబాటులో ఉంటాయని ఆయన పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం 8919493417లో సంప్రదించాలని డీఎం సూచించారు.


శ్రీనివాసరావుకు శుభాకాంక్షలు చెబుతున్న శ్రీనివాస్‌రెడ్డి, నగేష్ తదితరులు

టీజీఈఆర్‌సీ సభ్యులకు శుభాకాంక్షలు

ఎర్రగడ్డ, మే 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి(టీజీఈఆర్‌సీ) కమిషన్ సభ్యులుగా శ్రీనివాసరావు, రఘు నియమితులయ్యారు. తెలంగాణ పవర్ ఎంప్లాయిస్ యూనియన్ 1535 రాష్ట్ర అధ్యక్షుడు కల్లెం శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు విద్యుత్ సౌధలో వారిని బుధవారం కలిసి శుభాకాంక్షలు చెప్పారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ టీజీఈఆర్‌సీ కమిషన్ ఫైనాన్స్ సభ్యులుగా శ్రీనివాసరావు, టెక్నికల్ సభ్యులుగా రఘును నియమించడం హర్షణీయమన్నారు. విద్యుత్ శాఖ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు యూనియన్ అన్నివిధాలుగా కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండారి నగేష్, సెంట్రల్ కమిటీ ఉపాధ్యక్షుడు సిర్ర ఆనంద్ కుమార్, విద్యుత్ సౌధ అధ్యక్షుడు అబ్దుల్ ఖాదర్, కార్యదర్శి సుమధురి, నాయకులు రవి, కేబీ సలీం, అనంతరెడ్డి, అజీమ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా రమాదేవి

బర్కత్‌పుర, మే 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ప్రముఖ క్రీడాకారిణి జి.రమాదేవి నియమితులయ్యారు. ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణ ముదిరాజ్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఆమె ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు తెలిపారు.

రేపు వ్యవసాయ వర్సిటీలో ఎన్నికలు

● 17న ఓట్ల లెక్కింపు

రాజేంద్రనగర్, మే 14 (ఆంధ్రజ్యోతి): ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ గుర్తింపు సంఘం కోసం నిర్వహిస్తున్న ఎన్నికల ప్రచారం మంగళవారం సాయంత్రంతో ముగిసింది. తమకే ఓటు వేయాలని పోటీలో ఉన్న ఎం.శ్రీనివాస్ యాదవ్, పి.మహేశ్ ప్యానెల్‌ల సభ్యులు ఉద్యోగులను కలిసి విజ్ఞప్తి చేశారు. బుధవారం పోటీ పడుతున్న రెండు ప్యానెల్‌ల సభ్యులు రాజేంద్రనగర్ క్యాంపస్‌లో పోటాపోటీగా ప్రచారాలు నిర్వహించారు. ఈనెల 16న రాజేంద్రనగర్ క్యాంపస్‌లోని నాలుగు కేంద్రాలతోపాటు తెలంగాణ వ్యాప్తంగా ఉన్న మరో ఎనిమిది ప్రాంతాలలో పోలింగ్ జరగనుంది. మొత్తం 695 మంది ఉద్యోగులు ఓటింగ్‌లో పాల్గొననున్నారు. ఓట్ల లెక్కింపును ఈనెల 17న రాజేంద్రనగర్‌లో నిర్వహించనున్నారు.

పోటీలో రెండు ప్యానెళ్లు

ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం నాన్‌టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ గుర్తింపు సంఘం ఎన్నికలలో రెండు ప్యానెళ్లు తలపడుతున్నాయి. వారిలో గతంలో వర్సిటీ నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కొనసాగిన ఎం.శ్రీనివాస్ యాదవ్ ప్యానెల్ ఒకటైతే, మరొకటి గతంలో ఉపాధ్యక్షుడిగా పనిచేసిన పి.మహేశ్ ప్యానెళ్లు ఉన్నాయి.

శ్రీనివాస్ యాదవ్ ప్యానెల్‌లో..

అధ్యక్షుడిగా పోటీ చేస్తున్న ఎం.శ్రీనివాస్ యాదవ్(పుస్తకం గుర్తు) అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఎం.రాజు(లాంతరు), ఉపాధ్యక్షుడిగా ఎం.దశరథ్(కుర్చీ), ప్రధాన కార్యదర్శిగా ఎస్.జయరామ్ (ట్రాక్టరు), సంయుక్త కార్యదర్శిగా జి.పరమేశ్(కుట్టుమిషన్), కార్యనిర్వాహక కార్యదర్శిగా ఎస్.రవీందర్‌రెడ్డి(గడియారం), సాంస్కృతిక, క్రీడల కార్యదర్శిగా ఎం.సంజీవరెడ్డి(తాళం), సాంకేతిక విభాగం కార్యదర్శిగా జి.సులోచన(విమానం), కోశాధికారిగా ఎస్.కె.నజీర్(హెల్మెట్) గుర్తులు కేటాయించారు.

పి.మహేశ్ ప్యానెల్‌లో..

అధ్యక్షుడిగా పోటీచేస్తున్న పి.మహేశ్ (స్పూన్), అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఎస్.శ్రీనివాస్(మైక్), ఉపాధ్యక్షుడిగా ఎం.కృష్ణ (రేడియో), ప్రధాన కార్యదర్శిగా ఎస్.అమృత్‌రెడ్డి(సెల్‌ఫోన్), సంయుక్త కార్యదర్శిగా సీహెచ్ శ్రీధర్(పడవ), కార్యనిర్వాహక కార్యదర్శిగా సోమ కవిత(గొడుగు), క్రీడలు, సాంస్కృతిక కార్యదర్శిగా మహ్మద్ జహంగీర్(అగ్గి పెట్టె), సాంకేతిక విభాగం కార్యదర్శిగా జె.ప్రియాంక(స్కూటర్), కోశాధికారిగా బి.స్వప్నారెడ్డి(గాలి పటం) గుర్తులను కేటాయించారు.

పెళ్లి ఇంట్లో హిజ్రాల హల్‌చల్

హైదరాబాద్ సిటీ, మే 14 (ఆంధ్రజ్యోతి): పెళ్లి జరుగుతున్న ఇంటికి వెళ్లిన హిజ్రాలు అసభ్యకర చేష్టలతోపాటు దూషణలకు పాల్పడ్డ సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రహ్మత్‌నగర్‌లోని అమర్‌పాయింట్ లైన్‌లో ఉంటున్న ఓ ఇంట్లో వివాహ వేడుక జరుగుతోంది. ఇందులో భాగంగా ఇంటి ముందు పందిరి వేశారు. పెళ్లి పందిరి గమనించిన హిజ్రాలు హీనా(21), రిషిక(19) ఇంట్లోకి వెళ్లారు. పెళ్లి కాబోయే యువతికి బొట్టుపెట్టి ఆశీర్వదించారు. అంతేగాకుండా ఇంటి ముందు ఓ గుర్తుపెట్టారు. బుధవారం మళ్లీ పెళ్లి ఇంటికి వెళ్లిన హిజ్రాలు రూ.30 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అడిగినంత డబ్బు ఇవ్వకపోవడంతో గొడవకు దిగి అసభ్యకర చేష్టలకు పాల్పడటంతోపాటు దూషించారు. దీంతో బాధితులు వెంటనే పోలీసులకు సమాచారమందించారు. మధురానగర్ పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి హిజ్రాలను అదుపులోకి తీసుకున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

రెండు రాష్ట్రాల్లో 90 ఇళ్లలో చోరీలు

● నిందితుడి అరెస్ట్


రామకృష్ణ

విశాఖపట్నం(ఎంవీపీ కాలనీ), మే 14 (ఆంధ్రజ్యోతి): రెండు తెలుగు రాష్ట్రాల్లో 90 చోరీలకు పాల్పడిన గజదొంగను అరెస్టు చేసినట్టు క్రైమ్ ఏడీసీపీ మోహన్‌రావు తెలిపారు. ఎంవీపీ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. విశాఖపట్నం మధురానగర్‌లోని రాధామాధవ టవర్స్‌లో మార్చి ఒకటో తేదీన జరిగిన దొంగతనం కేసులో నిందితుడు హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌కు చెందిన తిప్పరాజు రామకృష్ణ అలియాస్ రాము అలియాస్ అభిరామ్, అలియాస్ శ్రీను(26)ను అరెస్టు చేసినట్టు తెలిపారు. ఈ చోరీలో 23 తులాల బంగారం, రూ.లక్ష నగదు దొంగిలించినట్టు చెప్పారు. అపహరించిన సొత్తును హైదరాబాద్‌లో ఉంటున్న నిందితుడి మేనల్లుడు అశోక్, అతడి సోదరి భాగ్యమ్మ వద్ద దాస్తూ ఉండేవాడు. ఈ కేసులో నిందితుడి నుంచి రూ.పది వేలు స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించారు. అలాగే, నిందితుడు తెలంగాణలోని పలు ప్రాంతాల్లో సైతం చోరీలకు పాల్పడి ఉండడంతో దర్యాప్తు చేపట్టిన హైదరాబాద్‌లోని ఎస్సార్‌నగర్ పోలీసులు ఇంతకు ముందు శ్రీనును అరెస్టు చేశారు. ఈ క్రమంలో నిందితుల నుంచి రూ.3.40 లక్షలు, 50 గ్రాములు, 26 గ్రాముల రెండు బంగారు నెక్లెస్‌లు, ఏడు గ్రాముల చెవిరింగ్‌ల జత స్వాధీనం చేసుకున్నట్టు ఏడీసీపీ మోహన్‌రావు తెలిపారు. నిందితుడు శ్రీను తెలుగు రాష్ట్రాల్లో 79 ఇళ్లల్లో చోరీలకు పాల్పడినట్టు చెప్పారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు. సమావేశంలో ఏసీపీ లక్ష్మణరావు, సీఐ చక్రధర్, ఎస్సై రాజు పాల్గొన్నారు. కేసు పరిశోధనలో చురుగ్గా వ్యవహరించిన సిబ్బందిని అధికారులు అభినందించారు.

ఇద్దరు యువకులు అదృశ్యం

యూసు‌ఫ్‌గూడ, మే 14 (ఆంధ్రజ్యోతి): మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిన ఇద్దరు యువకులు అదృశ్యమయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రహ్మత్‌నగర్ వీడియోగల్లీకి చెందిన మోటూరు విజయ్(18) ఈ నెల 12న ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో తల్లి మోటూరు లక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కార్మికనగర్ ఓంనగర్‌కు చెందిన గువ్వలి విజయ్ కుమార్ (18) ఈనెల 12న తల్లి మందలించిందని ఇంట్లో చెప్పకుండా వెళ్లిపోయాడు. తల్లి ఈశ్వరమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది.



పికెట్ కేంద్రీయ విద్యాలయం

ప్రతిభను చాటిన పికెట్ కేవీఎస్ విద్యార్థులు

● ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియట్‌లో 100/100 ఉత్తీర్ణత

మారేడుపల్లి, మే 14 (ఆంధ్రజ్యోతి) : పికెట్ కేంద్రీయ విద్యాలయంలో పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో విద్యార్థులు 100కు 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. మంగళవారం విడుదలైన సెంట్రల్ సిలబస్ పరీక్ష ఫలితాల్లో పికెట్ కేవీఎస్ స్కూల్ విద్యార్థినీ, విద్యార్థులు మంచి మార్కులు సాధించి ప్రతిభ కనబరిచారు. ఎస్ఎస్‌సీలో 230 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఎస్ఎస్‌సీలో లాస్య ప్రియాంక కుసం 482 మార్కులు, ఇషాన్ సమంతే రా 481 మార్కులు, దక్షి ఎం పంజివాణి 480 మార్కులు సాధించి టాపర్లుగా నిలిచారు. సీబీఎస్ ఇంటర్మీడియట్‌లో 103 మంది పరీక్షలు రాయగా 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. నీరజ నిధి గుప్త ఆర్ట్ స్ట్రీమ్ కోర్సులో 464 మార్కులు, సైన్స్ స్ట్రీమ్ కోర్సులో గోమాతం వెంకట హేమంత్ రాఘవ 460 మార్కులు, సైన్స్ స్ట్రీమ్ కోర్సులో ఉప్పల సత్య 455 మార్కులు సాధించి టాపర్లుగా నిలిచారని పికెట్ కెవిఎస్ ప్రిన్సిపల్ రూపేందర్ సింగ్ తెలిపారు.

అధ్వానంగా బొల్లారం పార్కు

పూర్వ వైభవం తీసుకురావాలని స్థానికుల వినతి

సికింద్రాబాద్, తిరుమలగిరి మే 13 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లోని అతి పెద్దదైన, ముఖ్యమైన బొల్లారం పార్కు నిర్వహణ రోజురోజుకూ అధ్వానంగా మారుతోంది. సుందర నందనంగా అందరినీ అలరించిన ఈ పార్కు నిర్వహణపై ప్రస్తుతం అధికారులు దృష్టి సారించకపోవడంపై స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కంటోన్మెంట్‌లో బొల్లారం, పికెట్, బోయినపల్లి సంచారపురి కాలనీ, మహేంద్రాహిల్స్ పార్కులు పెద్దవి. వీటిలో బొల్లారం పార్కుకు ప్రాధాన్యత ఉంది. గతంలో పచ్చదనంతో పరిఢవిల్లిన పార్కు నేడు దుమ్ము ధూళితో దర్శనమిస్తోంది. మూడు ఎకరాల స్థలంలో పచ్చదనంతో చూడముచ్చటగా ఉండేది. బొల్లారం పరిసర ప్రాంతాలైన అల్వాల్, మచ్చ బొల్లారం అనేక ప్రాంతాలకు చెందిన మహిళలు, చిన్నారులు పార్కుకు వచ్చి ప్రకృతిని ఆస్వాదిస్తూ, వ్యాయామంతో పాటు కుటుంబ సభ్యులతో వాకింగ్ చేస్తూ ఉంటారు. అయితే మౌలిక వసతులు లోపిస్తుండడం, నిర్వహణ సరిగ్గా లేక సందర్శకులు రోజు రోజు తగ్గుతున్నారు. చిన్నారులు ఆటలు ఆడుకోవడానికి ఏర్పాటు చేసిన ఆట పరికరాలు కొన్ని విరిగిపోవడంతో మూలకు పడవేశారు. మూత్రశాలలు సరిగా లేకపోవడంతో పాటు దుర్వాసన వెదజల్లుతోందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే మూత్రశాలలకు తలుపులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మూత్రశాలలకు స్త్రీ, పురుషులు అనే సూచిక బోర్డు లేకపోవడంతో గందరగోళ పరిసితి నెలకొంటుంది. పార్కులో చెత్త చెదారం పేరుకుపోతోంది. ఆ చెత్తలో నుండి పాములు బయటకు వచ్చి చిన్నారులకు, మహిళలకు కాటేసే ప్రమాదం ఉందని పలువురు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు.



వసతులు కల్పించాలి



ఒకప్పుడు పార్కు పచ్చదనంతో, సందర్శకులతో కళకళలాడుతుండేది. ప్రస్తుతం దుమ్ము ధూళితో కొట్టుమిట్టాడుతుంది. పార్కుకు వెళ్లిన ప్రజలకు మౌలిక వసతులు లేక ఇబ్బందులు పడుతున్నాం. అలాగే పార్కు సమయాలు తెలిపే సూచిక బోర్డులు కూడా లేక ఇబ్బందులు పడుతున్నాం. వెంటనే వసతులు కల్పించాలి.

- జీవి బాల్‌రాజ్

తలుపులు ఏర్పాటు చేయాలి



కంటోన్మెంటు పార్కులో టాయిలెట్స్‌కు తలుపులు లేకపోవడంతో మహిళలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. తలుపులు ఏర్పాటు చేయడంతో పాటు స్త్రీలు, పురుషులు అనే సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి.

- శ్రీనివాస్

స్థానికుల విజ్ఞప్తి

సికింద్రాబాద్ కంటోన్మెంట్ ముఖ్యకార్యనిర్వహణాధికారి డి.మధుకర్ నాయక్ బొల్లారంలోని కంటోన్మెంట్ పార్కు నిర్వహణపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. దేశంలోని అతి పెద్దదైన సికింద్రాబాద్ కంటోన్మెంట్ సందర్శనకు వచ్చే ప్రముఖులు, ఉన్నతాధికారులు ఈ పార్కులో కూడా కాలు మోపడం ఆనవాయితీగా చెబుతుంటారు. గతంలో ఈ పార్కును, పార్కు నిర్వహణను చూసి కితాబునిచ్చేవారు. ఇంత ప్రాధాన్యం ఉన్న పార్కుకు పూర్వవైభవం తీసుకురావాలని మధుకర్ నాయక్‌కు స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రజల రక్షణ కోసమే ఆకస్మిక తనిఖీలు

● బోయినపల్లి ఇన్‌స్పెక్టర్ తిరుపతి రాజు

బోయినపల్లి, మే 14 (ఆంధ్రజ్యోతి) : ప్రజల రక్షణ కోసం ఆకస్మిక తనిఖీలు చేస్తున్నట్లు, మీ చుట్టుపక్కల ఎవరైనా అనుమానస్పదంగా సంచరిస్తే డయల్ 100కు సమాచారం అందించాలని బోయినపల్లి ఇన్‌స్పెక్టర్ తిరుపతి రాజు తెలిపారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని బేగంపేట ఏసీపీ గోపాలకృష్ణమూర్తి ఆదేశాల మేరకు పోలీసులు మీ కోసం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. బుధవారం బోయినపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని గణేష్ పాన్‌షాప్ చౌరస్తా, బోయినపల్లి చౌరాస్తా, ఏడుగుడుల దేవాలయం ప్రాంతం, జయనగర్, కంసారి బజార్ ప్రాంతాల్లో బోయినపల్లి ఇన్‌స్పెక్టర్ తిరుపతి రాజు, డీఐ సర్ధార్ నాయక్‌ల ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్సులు, ఆటోల్లో ప్రయాణిస్తున్న ప్రయాణికుల లగేజీలు, ఇతర వస్తువులను క్షుణ్ణంగా తనిఖీలు చేశారు.

అంతేకాకుండా పలు ప్రాంతాలలో, బస్తీలలో నివాసముంటున్న ఇతర రాష్ట్రాలకు సంబంధించిన వ్యక్తులు చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినట్లయితే డయల్ 100కు సమాచారం అందించాలని సూచించారు. సంఘవిద్రోహశక్తులకు సహకరించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బోయినపల్లి ఎస్ఐ శివశంకర్, గిరిధర్, నాగేంద్ర బాబు, కల్పనా, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



బోయినపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఆకస్మిక తనిఖీలు చేస్తున్న పోలీసులు

హెల్మెట్ తప్పక ధరించాలి : ఏసీపీ

అమీర్‌పేట, మే 14 (ఆంధ్రజ్యోతి): అతివేగం ప్రమాదకరమని, వాహనాలు నడిపేటప్పుడు ప్రతి ఒక్కరూ హెల్మెట్ తప్పకుండా ధరించాలని నార్త్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు సూచించారు. హైదరాబాద్ కమిషనర్ సీవీ ఆనంద్, ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్, ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే ఆదేశాల మేరకు బుధవారం బేగంపేట టీటీఐ ఇన్‌స్పెక్టర్ నాగుల అశోక్‌తో కలిసి టాటా ఏఐజీ ఇన్సూరెన్స్ సిబ్బందికి అమీర్‌పేటలోని కార్యాలయంలో రోడ్డు ప్రమాదాల గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ అతివేగం అంతిమ ప్రయాణం అవుతుందన్నారు. రహదారులపై ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ప్రమాదాల నివారణకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో సంస్థ డిప్యూటీ వైస్ ప్రెసిడెంట్ గోపాల్‌రావు, డిప్యూటీ మేనేజర్ సురేష్‌బాబు, బేగంపేట టీటీఐ సిబ్బంది అయాన్, కృష్ణ పాల్గొన్నారు.



ఏసీపీ శంకర్ రాజు

అసోసియేషన్ అధ్యక్షుడి ఎన్నిక

మారేడుపల్లి, మే 14 (ఆంధ్రజ్యోతి) : డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణంతో పాటు కాలనీ ప్రజల సమస్యలు పరిష్కారం అయ్యాయని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ చెప్పారు. ఇటీవల బన్సీలాల్‌పేట్ డివిజన్‌లోని జీవైఆర్ కాంపౌండ్ డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా వెంకట్‌బాబు ఎన్నికయ్యారు. కాగా బుధవారం కాలనీవాసులతో కలిసి ఎమ్మెల్యేను మారేడుపల్లిలోని కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు లక్ష్మీపతి, నరేష్ బాబు, జయంతి, లావణ్య, బాల్‌రాజ్, జంగిర్, సత్యం, సత్యనారాయణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



డ్రైవింగ్ నేర్చుకుంటున్న మహిళలు

మహిళలకు ఉచితంగా డ్రైవింగ్ శిక్షణ

బేగంపేట, మే 14 (ఆంధ్రజ్యోతి): బేగంపేటలోని ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్‌లో మహిళలకు ఉచితంగా ద్విచక్ర వాహనాల డ్రైవింగ్ శిక్షణను ఇస్తున్నారు. ట్రాఫిక్ పోలీసులు, హీరో మోటార్స్ కార్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ శిక్షణ ఇస్తున్నట్లు హీరో మోటార్ కార్ మేనేజర్ ఇమామ్ జాఫర్ హెచ్ సాగర్ తెలిపారు. ఐదు రోజులకు ఒక బ్యాచ్ చొప్పున ఎంపిక చేసి డ్రైవింగ్ నేర్పిస్తున్నట్లు తెలిపారు. డ్రైవింగ్ నేర్చుకోవాలనుకునే వారు 18 సంవత్సరాలు నిండి ఉండాలని, ఆధార్‌కార్డుతో పాటు ఫొటో తీసుకుని వచ్చి పేరు నమోదు చేసుకోవాలని ఆయ న సూచించారు. పురుషులకు కూడా నేర్పించేందుకు నిర్ణయించామని, త్వరలోనే వారికి కూడా టూ వీలర్ డ్రైవింగ్ పై శిక్షణ ఉంటుందని ఆయన తెలిపారు.



ఎమ్మెల్యేకు పూలమొక్కను అందజేస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

మహాలక్ష్మి ఆలయ వార్షికోత్సవానికి ఎమ్మెల్యేకు ఆహ్వానం

మౌలాలి, మే 14 (ఆంధ్రజ్యోతి): మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిని బుధవారం మహాలక్ష్మి ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కలిశారు. మహాలక్ష్మి ఆలయ వార్షికోత్సవ వేడుకలకు హాజరు కావాలని కోరుతూ ఆహ్వాన పత్రికను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మౌలాలి డివిజన్ ప్రశాంత్‌నగర్ కాలనీలోని మహాలక్ష్మి ఆలయ వార్షికోత్సవాలు ఈ నెల 22న ప్రారంభమవుతాయని తెలిపారు. మూడు రోజుల పాటు వార్షికోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్టు వారు చెప్పారు. ఇందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని బుచ్చిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



డివిజన్ కమిటీ సమావేశంలో పాల్గొన్న టీడీపీ నాయకులు

టీడీపీ బలోపేతానికి కృషి చేయాలి

కుషాయిగూడ, మే 14 (ఆంధ్రజ్యోతి): టీడీపీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పార్టీ జిల్లా నాయకుడు రుద్రగోని రాంచందర్‌గౌడ్ కోరారు. బుధవారం చర్లపల్లి డివిజన్ టీడీపీ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్ కమిటీల ఎన్నికపై వారు చర్చించారు. సమావేశంలో నాయకులు కొమ్ము ఉపేందర్, బింగి భిక్షపతిగౌడ్, ప్రేమ్‌కుమార్ గౌడ్, నాదంగౌడ్, సత్యంయాదవ్, నందంగౌడ్, బాలకృష్ణ, కృపారావు, ఉత్తిష్ణ, సురేష్ గుప్త, కృష్ణ, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ బస్సు, డీసీఎం దగ్ధం

● ఫిర్యాదు చేయని బస్సు యజమాని ● అనుమానం వ్యక్తం చేస్తున్న అధికారులు



మంటల్లో దగ్ధమవుతున్న స్కూల్ బస్సు

బోయినపల్లి, మే 14(ఆంధ్రజ్యోతి) : బోయినపల్లి చెక్‌పోస్ట్ ప్రాంతంలోని ఓ మెకానిక్ షెడ్డుకు మరమత్తుల కోసం వచ్చిన జనగాంకు చెందిన ఓ స్కూల్ బస్సు అనుమానస్పదంగా దగ్ధం కాగా పక్కనే ఉన్న డీసీఎం వ్యాను కూడా పూర్తిగా దగ్ధమైంది. బుధవారం వాహనాలకు డెంటింగ్ పని చేస్తుండగా స్కూల్ బస్సులో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. అకస్మాత్తుగా బస్సులో మంటలు ఎలా చెలరేగాయోనని పోలీసులు, ఫైర్ సిబ్బంది ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. బస్సు యాజమానిని వివరాలు అడుగగా దాటవేసే ధోరణితో అసలు మీడియాకు ఏమి అవసరం అంటూ అసందర్భంగా మాట్లాడటం చర్చనీయాంశం అయింది. బస్సు యాజమాని పోలీసులకు, ఫైర్ సిబ్బందికి కూడా సహకరించకపోవడంతో పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అంత పెద్ద షెడ్‌లో ఆ ఒక్క బస్సే ఎందుకు దగ్ధమైందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ విషయంలో పోలీసులు లోతుగా విచారణ జరిపి నిజాలు నెగ్గుతేల్చాలని స్థానికులు కోరుతున్నారు. కాగా ప్రమాదానికి సంబంధించి యజమాని పోలీసులకు ఫిర్యాదు చేయకుండా దాటవేసే ధోరణితో మాట్లాడుతూ, ఫిర్యాదు చేయకపోవడంతో దీనిపై పోలీసులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.



మంటలను అదుపుచేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

లయన్స్ క్లబ్ సేవలు అమోఘం

మల్కాజ్‌గిరి, మే 14 (ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ సేవలు అమోఘమని మాజీ కార్పొరేటర్ మురుగేశ్ అన్నారు. ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్‌లోని ప్రశాంత్‌నగర్ గ్రౌండ్స్‌లో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో చిన్నారులకు వేసవి క్రీడా శిక్షణ శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరానికి హాజరైన మాజీ కార్పొరేటర్ విద్యార్థులకు ఫ్రూట్‌జ్యూస్, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి శిక్షణ శిబిరాలు చిన్నారుల్లో క్రీడా స్ఫూర్తిని నింపుతాయని అన్నారు. విద్యార్థుల కోసం లయన్స్ క్లబ్ వారు ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు రాజేంద్ర ప్రసాద్, కళ్ళెం మోహన్‌రెడ్డి, శేఖర్, డా.సంతోషి, బ్రహ్మచారి, నాయకులు పిట్టల శ్రీనివాస్, జంగరాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.



చిన్నారులతో మాజీ కార్పొరేటర్ మురుగేశ్

పారిశుధ్యంపై శ్రద్ధ వహించాలి

● మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్

మల్కాజ్‌గిరి, మే 14 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని మల్కాజిగిరి కార్పొరేటర్ ఉరపల్లి శ్రవణ్ అధికారులు, సిబ్బందికి సూచించారు. వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో కలిసి డివిజన్ పరిధిలోని ఆయా కాలనీల్లో మల్కాజ్‌గిరి డివిజన్ కార్పొరేటర్ బుదవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో రూ 20 లక్షల వ్యయంతో భూగర్భ డ్రైనేజీ, సీసీరోడ్ల పనులను ఆయన ప్రారంభించారు. పరిసరాల శుభ్రత, పచ్చదనానికి ప్రాధాన్యమివ్వాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వాటర్‌వర్క్స్ మేనేజర్ సునీల్‌కుమార్, జీహెచ్ఎంసీ ఏఈ నవీన్, ఏఎంహెచ్‌ఓ డా.మంజుల, ఏఈ తేజస్విని, రమేశ్, ప్రణయ్, స్థానికులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సీనియర్ నేత శ్రీశైలం యాదవ్‌కు పితృవియోగం



సత్యనారాయణ (ఫైల్)

ముషీరాబాద్, మే 14 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్ గాంధీనగర్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు శ్రీశైలం యాదవ్ తండ్రి సత్యనారాయణ(74) బుధవారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయన తీవ్ర అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం యశోధ ఆసుపత్రికి తీసుకెళ్లగా వైద్యులు పరిశీలించి, చనిపోయారని ప్రకటించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు, ముఠా జైసింహా, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్ యాదవ్, కార్పొరేటర్ పావని వినయ్ కుమార్, బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు పూసరాజు, తెలంగాణ ఉద్యమ నాయకుడు ప్రఫుల్ రాంరెడ్డి తదితరులు ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. గట్ల సత్యనారాయణ దివంగత ముఖ్యమంత్రి టి.అంజయ్య హయాంలో కాంగ్రెస్‌లో కీలక పాత్ర పోషించారు. అంజయ్యకు అత్యంత సన్నిహితుడిగా ఉండేవాడని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన అంత్యక్రియలు బన్సీలాల్‌పేట్ శ్మశాన వాటికలో జరిగాయి.

పూడిక తీసి.. నాలాలో పోసి!

● జీహెచ్ఎంసీ నిధులు నాలా పాలు
● నత్తనడకన నాలా పూడికతీత పనులు
● కొరవడిన ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణ

బేగంపేట, మే 14 (ఆంధ్రజ్యోతి): వేసవిలో నాలా ల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించే పనులు చేపడతారు. అధికారులు టెండర్లను పిలిచి గుత్తేదారులకు పనులను అప్పగిస్తారు. వీటిని పర్యవేక్షించాల్సిన ఇంజనీరింగ్ అధికారులు గుత్తేదారులతో కుమ్మక్కవడంతో పనులు నత్తనడకన సాగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ప్రధానంగా నాలాలో తీసిన పూడికను అక్కడే డంప్ చేయడంతో ఇటీవల కురిసిన వర్షానికి ఆ డంప్ చేసిన పూడికవ్యర్థాలు నాలాలో కలిశాయి. ఈ విషయాన్ని స్థానికులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నాలుగు నాలాల పూడికతీతకు రూ.55 లక్షలు

బేగంపేట డివిజన్‌లోని నాలుగు నాలాల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించేందుకు అధికారులు రూ.55 లక్షలతో పూడికతీత పనులకు శ్రీకారం చుట్టారు. పికెట్ నాలా, చికోటిగార్డెన్‌లోని ద్వారకాదాస్ నాలా, ఓల్డ్ కస్టమ్స్ బస్తీ నాలా, బేగంపేటలోని బ్రాహ్మణవాడి నుంచి మాతాజీనగర్ వరకు ఉన్న కూకట్‌పల్లి నాలాలో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించేందుకు జీహెచ్ఎంసీ ఏప్రిల్‌లో టెండర్లను పిలిచి పనులను అప్పగించింది. వీటిని దక్కించుకున్న గుత్తేదారు ఏప్రిల్‌లో పనులను ప్రారంభించారు. నాలా పూడికతీత పనులు వర్షాకాలం ప్రారంభమయ్యేలోగా పూర్తి చేయా లి. పికెట్ నాలాలో పనులను వేగంగా నిర్వహించిన గుత్తేదారు మరో మూడు నాలాల్లో పనులు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

కూకట్‌పల్లి నాలాలో అంతంత మాత్రమే..

వర్షాకాలంలో కూకట్‌పల్లి నాలా వరదనీటితో ఉధృతంగా ప్రవహిస్తూ రెండు వైపులా ఉన్న బస్తీలను ముంచెత్తుతోంది. బేగంపేట ఫ్లై ఓవర్ నుంచి మాతాజీనగర్ వరకు ఉన్న ఈ నాలా చాలా వెడల్పుతో పాటు లోతుగా ఉంటుంది. ఇక్కడ సుమారు నాలుగు అడుగుల మేర నాలాలో పూడిక పేరుకుపోయి ఉం టుంది. నాలా పూడికతీత పనులను చేపట్టిన గుత్తేదారు పూర్తిగా పూడికను తొలగించకుండా కొంతమేరకు తీయడంతో వర్షాకాలంలో కురిసిన వర్షాలకు వరదలు వస్తున్నాయని బ్రాహ్మణవాడి, మయూరిమార్గ్‌వాసులు ఆవేదన వ్య క్తం చేస్తున్నారు. తీసిన పూడికను నాలాలో రెండువైపులా డంప్ చేయడంతో ఇటీవల కురిసిన వర్షాలకు ఇందులో కొంత మళ్లీ నాలాలోకి చేరిందని స్థానికులు తెలిపారు. ప్రతీ సంవత్సరం ఈ నాలాలో పూడికతీత పనులు పూర్తిస్థాయిలో చేయకపోవడం వల్లనే నా లాకు రెండువైపులా ఉన్న బస్తీలు ముంపునకు గురవుతున్నాయని ఆయా ప్రాంతాలవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు ప్యాంటలూన్ నుంచి ద్వారకాదాస్ కాలనీ మీదుగా వెళ్తున్న నాలాపై స్లాబ్ ఉంది. ఇక్కడ పూడిక తీయాలంటే స్లాబ్‌పై ఉన్న మ్యాన్‌హోల్‌ను తొలగించి అందులో మనుషులు దిగి పూడికను బయటకు తీయాలి. ఇక్కడ కూడా ఒకరిద్దరితో పనులను అసంపూర్తిగా చేశారనే ఆరోపణలు ఉన్నాయి.



ఇటీవల కురిసిన వర్షానికి నాలాలో కలుస్తున్న పూడిక వ్యర్థాలు

వర్షానికి సగం పూడిక మళ్లీ నాలాలోకే..

ఓల్డ్‌కస్టమ్స్‌లోని రైలుపట్టాల వద్ద నుంచి శ్రీ కేసరి హనుమాన్ ఆలయం వరకు ఉన్న నాలాలో కొన్నిరోజుల క్రితం పూడికతీత పనులను చేపట్టారు. ఎగువ నుంచి పూడిక తీసిన మట్టి, చెత్తాచెదారాన్ని తీసుకొచ్చి హనుమాన్ ఆలయం సమీపంలోని నాలాకు ఒకవైపున డంప్ చేశారు. ఇటీవల నగరంలో పలుమార్లు వర్షాలు కురవడంతో నాలాలోనే డంప్ చేసిన వ్యర్థాలు వరద ఉధృతికి కొట్టుకుపోయాయి. దీంతో ఓల్డ్ కస్టమ్స్‌లో తీసిన పూడిక వెళ్లి కూకట్‌పల్లి నాలాలో కలిసింది. పూడిక తీసిన వ్యర్థాలను తడి ఆరగానే ఇక్కడ నుంచి తరలించేలా ఇంజనీరింగ్ అధికారులు చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

మే ఆఖరు వరకు నాలా పూడిక పనులు..

బేగంపేట డివిజన్‌లోని నాలుగు నాలాల్లో పూడికతీత పనులను ఏప్రిల్‌లో ప్రారంభించాం. పికెట్ నాలాలో పూడికతీయడంతో పాటు వ్యర్థాలను తొలగించాం. ఓల్డ్ కస్టమ్స్ బస్తీ నాలాలో పూడిక పనులు పూర్తయ్యాయి. అయితే వ్యర్థాలను నాలాలోనే డంప్ చేశారు. వీటిని తొలగించాల్సి ఉంది. కూకట్‌పల్లి నాలాలోని మయూరిమార్గ్ వద్ద పనులు జరుగుతున్నాయి. మే ఆఖరు వరకు పనులు కొనసాగిస్తాం.

- మహేష్, డీఈ, బేగంపేట సర్కిల్



లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేస్తున్న ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, మాజీ కార్పొరేటర్ వాజీద్ హుస్సేన్

పేదల పక్షపాతి కాంగ్రెస్ ప్రభుత్వం

ముషీరాబాద్, మే 14 (ఆంధ్రజ్యోతి): పేదల పక్షపాతి కాంగ్రెస్ ప్రభుత్వం అని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ అన్నారు. బుధవారం భోలక్‌పూర్‌కు చెందిన మహ్మద్ షకీల్, అబ్దుల్ లతీఫ్, గులామ్ మోహినొద్దీన్, ఆబేద్ హుస్సేన్, మహ్మద్ అలీకి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ... పేదలకు ప్రైవేటు ఆస్పత్రులలో మెరుగైన వైద్యం పొందేందుకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో దోహద పడుతుందన్నారు. పేదలకు సీఎం రేవంత్‌రెడ్డి అండగా ఉంటూ వారి అవసరాలను తీర్చుతున్నారు అన్నారు. ఈ కార్యక్రమంలో భోలక్‌పూర్ మాజీ కార్పొరేటర్ వాజీద్ హుస్సేన్ పాల్గొన్నారు.

వృద్ధురాలి అదృశ్యం



బౌద్ధనగర్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : మందుల కోసం బయటికి వెళ్లిన ఓ వృద్ధురాలు అదృశ్యమైన ఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సీతాఫల్‌మండి మహ్మద్‌గూడకు చెందిన అహ్మదీ బేగం(70) గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతుంది. ఈ క్రమంలో ఈ నెల 12న మందులు తెచ్చుకుంటున్నానని ఇంటి నుంచి బయటికి వెళ్లిన వృద్ధురాలు రాత్రి వరకు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లలో వాకబు చేసినా ఫలితం లేకపోయింది. భర్త మహ్మద్ గఫూర్ షరీఫ్ బుధవారం చిలకలగూడ పోలీసులకు లిఖిత పూర్వకంగా భార్యపై మిస్సింగ్ కేసు నమోదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.